కరుణించని కూటమి

- రేషన్ కార్డుల కోసం ప్రజల పాట్లు
- సర్వర్ సమస్యలతో తప్పని ఇక్కట్లు
- సచివాలయం వద్ద నిరీక్షణ



గంగలకుర్రు సచివాలయం

అంబాజీపేట: పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుండగా, ప్రజలకు రేషన్ కార్డులను అందిస్తామంటూ ప్రకటించింది. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే.. నిర్దేశిత సమయంలో కార్డు మంజూరవుతుందంటూ పాలకులు చెబుతున్నా, అసలు నమోదు కావడం లేదంటూ సచివాలయ ఉద్యోగులు దరఖాస్తుదారులకు చెబుతున్నారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరీక్షిస్తున్నా.. సర్వర్ పని చేయలేదంటూ సిబ్బంది చెబుతున్నారని వాపోతున్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా, ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడంపై వారు మండిపడుతున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 87, రాజోలు 74, పి.గన్నవరంలో 76 సచివాలయాలున్నాయి.

వెంటాడుతున్న ఇబ్బందులు

కొత్తగా పెళ్లయిన వారు కార్డు విభజన కోరుతూ సచివాలయాలకు వెళుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడం, ఇంటర్నెట్ సమస్య, కంప్యూటర్ మొరాయింపు, రేషన్ కార్డు, ఆధార్‌లో పొరబాట్లు, ఈ-కేవైసీ సమస్యలు వెంటాడుతున్నాయి. దరఖాస్తు సక్రమంగా ఉంటే, మూడు దశల వెరిఫికేషన్ పూర్తి చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాల్సి ఉంది. వీఆర్ఓ, ఆర్ఐ, డీటీ ఇలా వెరిఫికేషన్ పూర్తయ్యాక తహసీల్దార్ కార్డు మంజూరు చేస్తారు. మరోవైపు ఈ-కేవైసీ లాగిన్ వీఆర్ఓ, డిజిటల్ అసిస్టెంట్, విలేజ్ సర్వే మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఇచ్చారు. మధ్యాహ్నం సర్వర్లు పనిచేసే సమయంలో సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో రేషన్ కార్డు దరఖాస్తులు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రచారం చేస్తున్నా.. ఇప్పటి వరకు అది అందుబాటులోకి రాలేదంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డుదారుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని పాట్లు

పేద కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో కీలకం. ఏ పథకం వర్తించాలన్న రేషన్ కార్డు తప్పనిసరి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లను సంప్రదిస్తే చాలు.. నిర్ణీత సమయంలో రేషన్ కార్డు ఇంటికి చేరేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి తారుమారైంది. ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలు పక్కనపెడితే.. ఇతర సంక్షేమ పథకాలూ వర్తింపజేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



దరఖాస్తు సమయంలో వస్తున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల్లో సిబ్బంది సైతం దరఖాస్తులకు సహకరిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన 200 దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్నాం.

– సీహెచ్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్, అంబాజీపేట

సర్వర్ల సమస్యలు



రేషన్ కార్డులు దరఖాస్తు సమయంలో సర్వర్ల సమస్య ప్రధానంగా ఉంటోంది. సర్వర్లు పని చేయకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి.

– విత్తనాల ఇంద్రశేఖర్, మండల అధ్యక్షుడు,, వైఎస్సార్ సీపీ, అంబాజీపేట

ప్రీ ఎక్లంప్సియాపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: గర్భిణులు ప్రీ ఎక్లంప్సియా వంటి హానికరమైన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా, ముందుగా మేల్కొనాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ ప్రీ ఎక్లంప్సియా దినం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రెగ్నెన్సీకి ముందు లేదా ప్రెగ్నెన్సీ సమయంలో బీపీ ఉంటే తక్షణమే వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. ప్రీ ఎక్లంప్సియా వల్ల గర్భిణులకు కిడ్నీలో సమస్య, తలనొప్పి, కంటిచూపు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. దీనిపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

వెంకన్న రథశాలకు శంకుస్థాపన

కొత్తపేట: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి రథశాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. రూ. 38 లక్షలతో నిర్మించనున్న రథశాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు.

పెన్షనర్లకు ఫారం-16 జారీ

అమలాపురం టౌన్: గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం నుంచి ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్లకు ఫారం-16 జారీ చేసినట్లు అమలాపురం సబ్ ట్రెజరీ అధికారి రంగారావు తెలిపారు. ఇదే సమాచారాన్ని ఆయన జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. ఇలా ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన పెన్షనర్లు ట్రెజరీ కార్యాలయం పనివేళల్లో ఫారం -16ను తీసుకోవచ్చని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు సూచించారు.

ఇంటి వద్దకు రేషన్ నిలిపివేయడం ఓర్వలేనితనమే..

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజా రంజకంగా ప్రారంభించిన ఇంటి వద్దకే రేషన్ సరకుల పంపిణీ విధానాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిలిపివేయడం ఓర్వలేని తనమేనని పార్టీ జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి బారులు తీరి నిరీక్షించే దుస్థితికి చరమ గీతం పాడి ఇంటింటికీ రేషన్‌ను అందించే వాహనం (ఎండీయూ) వ్యవస్థను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎండియూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఇప్పటికే ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

కేడీఆర్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

పి.గన్నవరం: పట్టాభి రామస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అధికారులు తీసుకున్న నిర్ణయంతో ఏమాత్రం సంబంధంలేని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై ఇటీవల కృష్ణ ధర్మ రక్షణ సమితి రాష్ట్ర ముఖ్య అధ్యక్షుడు కె.దుర్గారావు (కేడీఆర్) ఇబ్బందికర వ్యాఖ్యలు చేశారని పలువురు జనసేన నాయకులు ఖండించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్ మాట్లాడారు. కేడీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామాలయం ఎదురుగా ఉన్న సుమారు మూడు సెంట్ల ఇరిగేషన్ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఇటీవల అధికారులు నిర్ణయించారన్నారు. భక్తుల కోరికపై ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి, స్థలం విషయంలో పునరాలోచన చేయాలని చెప్పారని వివరించారు. విషయం తెలుసుకోకుండా కేడీఆర్ వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు.

డ్రెయిన్ల మరమ్మతుల కోసం మంత్రికి వినతి

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థల తీరుపై వారం రోజులుగా సాక్షిలో వెలువడిన కథనాలకు ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో ఆయా అభివృద్ధి పనులకు నూతన ప్రతిపాదనలతో రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును నియోజకవర్గ కూటమి నేతలు కలిశారు. ఈ నెల 14న డ్రెయినేజీ వ్యవస్థపై, గత నెల 29న ఇరిగేషన్ వ్యవస్థపై సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో పొరుగు నియోజకవర్గమైన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు బుధవారం వెళ్లిన ఈ బృందం మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందించింది. డ్రెయినేజీ, ఇరిగేషన్ పనులకు రూ.6 కోట్లు నిధులు ఇవ్వాలని, వీటితో అత్యవసర పనులు నిర్వహిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంత్రిని విజ్ఞప్తి చేశారు. నిధుల మంజూరుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఈ బృందం పేర్కొంది. ఈ బృందంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు డీసీ పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, అడబాల యగంధర్ తదితరులున్నారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పుష్కరాల సమర్థ నిర్వహణకు చర్యలు

పి.గన్నవరం: రానున్న గోదావరి పుష్కరాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కేవీ ప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో సర్పంచ్‌లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పుష్కర ఘాట్లు ఉన్న గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్త ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల వద్ద సౌకర్యాల కల్పన, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఎంపీపీలు గనిశెట్టి నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓలు జి.భీమారావు, గొల్లపల్లి సరోవర్, కె.వెంకటేశ్వరరావు, డీఈలు చంద్రశేఖర్, రవీంద్రబాబు, ఏఈలు సుందర్‌సింగ్, ఆనంద బాబు, రవికుమార్, కల్యాణ చక్రవర్తి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఘనంగా సీతారాముల మహా పట్టాభిషేకం


స్వామివారికి మహా పట్టాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక గ్రామంలో వేంచేసిన సీతారామచంద్రస్వామి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవంలో భాగంగా గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో మహాపట్టాభిషేకం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి మహా పట్టాభిషేక మహోత్సవాన్ని వైభోవపేతంగా జరిపారు. వేదాశీర్వచనం, పండిత సత్కారం వంటి విశేష క్రతువులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించి, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

తల్లీకొడుకుల మరణం బాధాకరం

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

అంబాజీపేట: కొత్తగూడెంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మామిడిశెట్టి కనక దుర్గ, ఆమె కుమారుడు వెంకటరత్నం కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస రావు, పలువురు నాయకులు చిరతపూడిలో గురువారం పరామర్శించారు. తల్లీకొడుకుల భౌతికకాయాలకు శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రోడ్డు ప్రమాదంలో వీరి మరణం బాధాకరమని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ ఘటనలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ నలుగురి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కోట బేబీరాణి, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కుసుమ ఆనందరావు, నక్కా సత్యనారాయణ పరామర్శించిన వారిలో ఉన్నారు.


చిరతపూడిలో మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

నేడు విద్యుత్ అంతరాయం

కొత్తపేట: ట్రీ కటింగ్, కొత్త బ్రేకర్ ఎరక్షన్ కోసం స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాంబాబు గురువారం తెలిపారు. మండలంలోని కొత్తపేట, కేదార్లంక, నారాయణలంక, వాడపాలెం, బండారుపేట, చిన్నమెరక, పెద్ద మెరక, మద్దులమెరక, పనసలదొడ్డి, కొత్తపేట చిన్నగులపాలెం, పెద్దగులపాలెం, బోడిపాలెం, మందపల్లి, ఏనుగు మహల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

పవనపుత్రా.. పాహిమాం

- ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

సఖినేటిపల్లి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్వేది క్షేత్రంలో ఉపాలయంలో కొలువైన హనుమాన్ సన్నిధిలో స్వామికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. మోరి శ్రీరామభక్తాంజనేయ ఆలయంలో ఆలయ అర్చకుడు సుదర్శనం రంగాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తుడు అబ్బిసెట్టి శ్రీరామ్ స్వామికి 50 గ్రాముల వెండి గిన్నె సమర్పించారు. మోరి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ముత్యాల సతీష్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతర్వేదికర ఆలయంలో మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్ దంపతులు పూజలు చేశారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు, అంతర్వేది రోడ్డు సెంటర్, కేశవదాసుపాలెం ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామికి అభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు.

భారీ అన్నసమారాధనలు

కొత్తపేట: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామగ్రామాన ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాల్లో వైభవంగా విశేష పూజలు నిర్వహించారు. పలివెల ప్రధాన వీధిలో అభయాంజనేయస్వామికి ఆలయ వ్యవస్థాపకుడు వీవీఎస్ఎన్ మారుతిబంగారం, సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు వేదాశీస్సులతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే డీఎస్పీ సుంకర మురళీమోహన్, టీటీడీ మాజీ డైరెక్టర్ డొక్కా నాథబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు తనికెళ్ల వీఆర్‌ఎస్‌కే శాస్త్రి భారీఎత్తున అన్న సమారాధన చేశారు. అనంతరం మారుతీబంగారం సుమారు వంద మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక కోదండరామస్వామివారి ఆలయం వద్ద జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బోడిపాలెం వంతెన వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. శీలంవారిపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

పి.గన్నవరం: స్థానిక పితానివారిపాలెంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు అన్న సమారాధన చేశారు.


అంతర్వేది క్షేత్రంలో ఉపాలయంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

రాజోలు: రాజోలు సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేసి, తమలపాకులతో సుందరంగా అలంకరించారు. రాజోలు, పరిసర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. అమలాపురంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రకు రాజోలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు మోటార్ సైకిల్ ర్యాలీగా తరలివెళ్లారు.

ఘనంగా జయంతి వేడుకలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి తదితర గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పలివెలలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు

ఆధ్యాత్మిక శోభ

అంబాజీపేట: హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ గ్రామాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్థానిక పశువుల మార్కెట్‌లో అభయాంజనేయస్వామి, పెద్దవీధిలోని నాగమల్లె చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ, గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం హనుమాన్ సెంటర్‌లోను, ఇరుసుమండలోని భక్తాంజనేయ స్వామి, వ్యాఘ్రేశ్వరం , మాచవరం, గంగలకుర్రు, వక్కలంక, ముక్కామలలో ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతాయిలంకలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆయా ఆలయ ప్రాంగణాల వద్ద భారీ అన్న సమారాధన జరిగాయి. పసుపల్లిలో సీతారామ పట్టాభిషేకం, అనంతరం అన్నదానాలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

రావులపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా వివిధ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక ఊబలంక రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో, అలాగే హైవే రింగ్ రోడ్‌లోని భక్తాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివార్లను దర్శించుకున్నారు. అన్నసమారాధనలు జరిగాయి.


మోరి రామభక్తాంజనేయ స్వామివారి సన్నిధిలో వేడుకలు


రాజోలులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


పి.గన్నవరం శివారు పితానివారి పాలెంలో స్వామికి పూజలు


ఆలమూరులో విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ఇరుసుమండ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

ముత్యాలమ్మకు వెండి కిరీటం సమర్పణ


ముంగండలో ముత్యాలమ్మ వారికి వెండి కిరీటం సమర్పించిన దాతలు

పి.గన్నవరం: ముంగండలో వేంచేసిన ముత్యాలమ్మ వారికి గ్రామానికి చెందిన సాదా కృష్ణ దంపతులు కిలో వెండితో చేయించిన కిరీటాన్ని గురువారం అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలైన కృష్ణ దంపతులను అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..


శ్యామలకు సాయం అందిస్తున్న సహదేవ్ తదితరులు

సఖినేటిపల్లి: భర్త వియోగంతో బాధపడుతున్న భార్యకు అతడి స్నేహితులు కొండంత అండగా నిలిచారు. ఆమెకు గురువారం ఆర్థికసాయం కూడా అందజేశారు. మండలంలోని రామేశ్వరానికి చెందిన మత్తి రవికుమార్ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అతడి భార్య మత్తి శ్యామల ఇద్దరు సంతానాన్ని పోషించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకుని స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల పదో తరగతి 2003 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ స్నేహితులు వీరిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. స్నేహితులంతా కలసి మొత్తం రూ.50 వేలు సమకూర్చారు. ఇద్దరు పిల్లల పేరున రూ.20 వేల చొప్పున పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను, కుటుంబ ఖర్చులకు రూ.10 వేలను హ్యుమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధి తాడి సహదేవ్ చేతుల మీదుగా శ్యామలకు అందజేశారు.

అధ్వానంగా తాడివారి మెరక రోడ్డు


నగరం-తాడివారిమెరక రోడ్డు దుస్థితి

మామిడికుదురు: రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్న మాట ఎక్కడా వినిపించరాదన్నది సంక్రాంతి సమయంలో కూటమి సర్కారు ఇచ్చిన ఆదేశం. అది కేవలం మాటలకే పరిమితమనడానికి నిదర్శనమే మండలంలోని నగరం గ్రామంలోని తాడివారి మెరక వెళ్లే రోడ్డు దుస్థితి. పూర్తిగా పాడైపోయి.. అధ్వానంగా దర్శనమిస్తున్న ఈ రోడ్డును చూసి ప్రభుత్వ వైఖరిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ రోడ్డుపై నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 300 మీటర్ల పొడవున్న ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో ప్రజల బేజారు


ఏటిగట్టు రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన స్తంభం

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల సబ్ స్టేషన్ల పరిధిలో కొంతకాలంగా దొంగలు చెలరేగిపోతున్నారు. ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లనే చోరీ చేస్తుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి, అందులో రాగి తీగ, చమురుతో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 20న అర్ధరాత్రి జొన్నాడ నుంచి యానాం వెళ్లే ఏటిగట్టు రోడ్డులో ఓ రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు తస్కరించారు. వెంటనే నిందితులను గుర్తించి, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.